కాలనీవాసులకు తప్పని నీటి కష్టాలు

- తాగునీరు ఇప్పించాలని వేడుకుంటున్న కాలనీవాసులు
- ఇది బావాయిపాలెం జగనన్న కాలనీవాసుల ఆవేదన
- పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం


తాగునీరు ఇప్పించాలని వేడుకుంటున్న కాలనీవాసులు


ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించుకుని వాడుకుంటున్న కాలనీవాసులు

నిడమర్రు: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల శీతకన్ను, కూటమి ప్రభుత్వ కన్నెర్ర వెరశి పేదల కాలనీల్లో మౌలిక వసతులు కరువైన వైనం. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల మేర బిందెలు, డబ్బాలతో వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఇంకా కొల్లేరు గ్రామాల్లో కొనసాగుతోంది. బావాయిపాలెం గ్రామంలో పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలో తాగునీరు, వాడకం నీరు లేక ప్రజలు అలమటిస్తున్నారు. బావాయిపాలెం గ్రామంలో ఓ ప్రవేట్ స్కూల్ పక్కనే 4.5 ఎకరాలు కొనుగోలు చేసి 175 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వంలో అందించారు. గత ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవతో ఇంటి స్థలాలు, రహదారులుగా విభజించి గతంలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించారు. అప్పట్లో కాలనీకి గ్రావెల్ రోడ్లు, ప్రత్యేకించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేశారు. దీంతో 45 కుటుంబాల వరకూ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని నివాసం ఉంటున్నారు. కానీ నీటి సమస్యతో మిగిలిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

రూ.300 చెల్లించి నీటి కొనుగోలు

కాలనీలో తాగు, వాడకం నీటి కోసం కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. స్థానిక పంచాయతీకి రూ.300 చెల్లించి తాగునీటిని వాటర్ ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ చుట్టూ చేపల చెరువులు ఉండటంతో పంట బోదెల్లో ఉండే నీరు కలుషితం అవ్వడంతో ఆ నీటిని వాడకం నీటిగా కూడా ఉపయోగించ లేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు. కాలనీకి ఆనుకొని ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పక్కగా గ్రామ రక్షిత మంచినీటి పథకం, తాగునీటి పైప్ లైన్ వెళ్లిందని, ఆ పైప్‌లైన్ నుంచైనా పబ్లిక్ కుళాయి కాలనీలో ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


నీటిని డబ్బాలతో తెచ్చుకుంటున్న కాలనీవాసి

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాం



పల్లెపల్లెకు మన పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా ఇటీవల గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేకు కాలనీలోని తాగునీటి సమస్య, విద్యుత్ సమస్య వివరించాం. కానీ ఇప్పటివరకూ ఒక్క అధికారి కాలనీలో అడుగుపెట్టలేదు. కనీసం మా కాలనీ వైపు కన్నెత్తి చూడలేదు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం.

– బొబ్బిలి రామచంద్రరావు, బావాయిపాలెం కాలనీ

తిరిగి గ్రామంలో అద్దె ఇంటికి వెళ్లిపోతాం



కాలనీలో కనీసం తాగునీరు అందించేందుకు ఒక పబ్లిక్ కుళాయి అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. చుట్టూ చేపల చెరువుల వలన పంట బోదెల్లో నీరు కలుషితంగా ఉండటంతో వాడకానికి కూడా వినియోగించలేకపోతున్నాం. పరిస్థితి ఇలాగే ఉంటే తిరిగి గ్రామంలోని అద్దె ఇళ్లకు వెళ్లిపోతాం.

– ముత్యాల మంజు, బావాయిపాలెం కాలనీ

వాడకం నీటిని కొనుక్కుంటున్నాం



తాగునీరే కాదు, వాడకం నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి కాలనీ వాసులకు నెలకొంది. పంచాయతీ రక్షిత మంచి నీటి పథకం నుంచి ట్యాంకర్ రూ.300 వెచ్చించి కొనుగోలు చేస్తున్నాం. ఉచితంగా మంచినీటి ట్యాంకర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదు.

– బి.విజయలక్ష్మి, బావాయిపాలెం కాలనీ

క్లుప్తంగా

డ్రోన్లతో వ్యవసాయం లాభదాయకం


రైతులకు డ్రోన్లను పంపిణీ చేస్తున్న అధికారులు

పెదవేగి: వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం వలన రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. పెదవేగి మండలంలోని పెదకడిమి గ్రామ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై డ్రోన్లను పంపిణీ చేశారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ సీహెచ్ గ్రూపుకి వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై ఇచ్చిన డ్రోన్‌కు ఏపీజీబీ బ్యాంకు ద్వారా రూ.780000 లోన్ ఇచ్చారని చెప్పారు. బ్యాంకింగ్ సేవలను రైతులకు వివరించారు. పెదకడిమి సర్పంచి కోసరాజు బలరామకృష్ణ చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో వస్తున్న నూతన పరికరాలను, మార్పులను మనందరం ఆహ్వానించి వ్యవసాయాన్ని సులభతరం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం డి.నీలాద్రి, ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, కొప్పాక ఏపీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల్లో పెరుగుదల ఉండాలి


అర్ధవరం హైస్కూలులో విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో

గణపవరం: విద్యార్థుల సామర్థ్యాల పెంపు లక్ష్యంగా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేయాలని పశ్చిమగోదావరి జిల్లా డీఈవో నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన గణపవరం మండలం పిప్పర, అర్ధవరం పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యా విషయక కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అర్ధవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరాతీశారు. ఇటీవల విద్యాశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాలను ఆయన తనిఖీ చేశారు. మూల్యాంకన పుస్తకాల నిర్వహణ విషయంలో అశ్రద్ధ చూపొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆఫీసు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గొర్రెల బాలయ్య, అర్ధవరం హైస్కూలు హెచ్ఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

భీమడోలు: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, కురెళ్లగూడెం, ఎంఎంపురం గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏల సాధనకు శాసనమండలిలో తన వాణిని వినిపిస్తున్నామన్నారు. ఈ నెల 25వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, యూటీఎఫ్ కార్యదర్శి ఎం.శేఖర్, స్కూల్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, మస్తాన్, యలమర్తి రవీంద్రకుమార్, కె.ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఉంగుటూరు: ఉంగుటూరు భద్రకాళీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు న్విహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు నానాటికీ పెరుగుతున్నారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ప్రత్యేక వాహనాల్లో ద్వారకా తిరుమల, మద్ది క్షేత్రం, ఉంగుటూరు భద్రకాళీ అమ్మవారిని కూడా లెక్కలో వేసుకుని దర్శించి వెళుతున్నారు. దీంతో భక్తులు సంఖ్య గణనీయంగా పెరిగింది. శుక్రవారం తణుకు నుంచి వచ్చిన మహిళా భక్తులు మూడు పట్టు చీరలు అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. భక్తులకు ఆలయం తరఫున పాతూరి వంశీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రీ సర్వే పనులు ప్రారంభం

దెందులూరు: మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో రీ సర్వే పనులు ప్రారంభించామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావులతో కలిసి గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.సుమతి మాట్లాడుతూ మండలంలో ఇప్పటికీ రెండు గ్రామాలు రీ సర్వే దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. మిగిలిన 15 గ్రామ పంచాయతీల్లో 32000 ఎకరాలు రీ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సమన్వయం, ప్రణాళికతో ఎటువంటి పొరపాట్లు జరగకుండా రీ సర్వే పనులు చేయాలన్నారు. ముందుగా రైతులకు నోటీసులు విధిగా ఇవ్వాలన్నారు.

వసతి గృహం బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ


శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉంగుటూరు: బొమ్మిడి, ఉంగుటూరు వసతి గృహాల బాలకలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమెన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ ఇవంజలి మాట్లాడుతూ బాలికలు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వార్డెన్లు మాధవి, బాల మేడమ్, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


భీమడోలు: గుండుగొలనులో శాంతి ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు

భీమడోలు: ప్రపంచ శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో గుండుగొలను గ్రామంలోని ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డీసీసీబీ మాజీ డైరెక్టర్ బంటు విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పాత సంతమార్కెట్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మానవత సంస్థ ఉత్తమ సమాజ స్థాపన సాధనకు కృషి చేస్తుందని, ఏన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం, కో–ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు శిరిబత్తిన కొండబాబు, జిల్లా అధ్యక్షుడు అల్లాడ ప్రసాద్, కేంద్ర కమిటీ కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు, కోశాధికారి రమణశంకర్, కోశాధికారి చిలపర్తి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యత


గణపవరం: మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, మానవత సభ్యులు

గణపవరం: శాంతియుత సమాజంలోనే అభివృద్ధి సాధ్యమని శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పలువురు అన్నారు. శుక్రవారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా గణపవరం మండల మానవత శాఖ, విద్యాజ్యోతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించి, మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా మానవత మండల శాఖ అధ్యక్షుడు గంటా అన్నవరం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కలసిమెలసి, సోదరభావంతో జీవిస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక మాట్లాడుతూ మానవత సంస్థ శాంత స్థాపన కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గణపవరం: గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజికి చెందిన నలుగురు విద్యార్థులు నాలుగో సెమిస్టర్‌లో నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. శుక్రవారం డిగ్రీ కాలేజిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్.చైత్రవాణి, కోలా కుమారి, నాజవి, సత్యశ్రీలను అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక చవితి పర్యావరణ హితంగా నిర్వహించాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెదవేగి: వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా నిర్వహించాలని కేవలం పూజలో మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను మాత్రమే వాడాలని ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదవేగి మండలం వేగివాడ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆదేశానుసారం ఏలూరు ప్రాంతీయ కార్యాలయం కాలుష్య నియంత్రణ మండలి వారి పర్యవేక్షణలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు సూచనలతో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడడం వలన పర్యావరణం ఇబ్బంది పడుతుందని జల కాలుష్యం అవుతుందని తెలిపారు. వాయు కాలుష్యాన్ని కూడా తగ్గించాలని సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులని నిషేధించాలని పరిసరాల పరిశుభ్రత పాటించాలని తదితర అంశాలపై కళాకారుల బృందం కళాజాత ద్వారా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏలూరుకు చెందిన ఎం శ్రీదివ్య కల్చరల్ సొసైటీ కళాజాత బృంద కళాకారులు ఎం కుమార్, ఎం తిరుపతి పాల్గొన్నారు.

చవితికి ఆన్‌లైన్‌లో అనుమతులు


ఎస్సై శివాజీ

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానంలో అనుమతులు మంజూరు చేస్తామని ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. శుక్రవారం ఏలూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అనుమతులకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నిర్వాహకులు విధిగా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి ఉత్సవాల నిర్వహణకు అనుమతి మౌఖికంగా కాకుండా లికిత పూర్వకంగా పొందాలన్నారు. దరఖాస్తు చేయగానే సంబంధిత పోలీసు అధికారి ఆ గ్రామంలో ఆ ప్రాంతాన్ని తనిఖీ చేసి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. ఎన్‌ఓసీ ఉచితంగా జారీ చేస్తామన్నారు. ఏ గ్రామంలోనైనా ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఉత్సవాలు ముగిసే వరకు ప్రశాంతంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగిన సహించేది లేదన్నారు. మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్సై శివాజీ సూచించారు.

దాతల సేవలు అభినందనీయం

భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై వంతెన నిర్మాణానికి దాతల సేవలు అభినందనీయమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలనులో శుక్రవారం సాయంత్రం వంతెన నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సాయం చేసిన దాతల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, వట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక బీజేపీ నేతలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మాంసం విక్రయ కేంద్రాలన్నీ ఒకే చోట ఉండేలా, డైలీ మార్కెట్‌లో ఏర్పడే చెత్తను వారానికి రెండు సార్లు బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాతూరి నాగభూషణానికి ఘన నివాళి


నాగభూషణం చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న గ్రంథాలయ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

పెదపాడు: స్వాతంత్ర్య సమరయోధుడిగా, గ్రంథాలయ ఉద్యమ నాయకుడిగా వయోజన విద్యా వ్యాప్తికి విశేష కృషి చేసిన త్యాగధనుడు పాతూరి నాగభూషణమని ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు (ఎల్‌వీఆర్) కొనియాడారు. శుక్రవారం ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు గ్రంథాలయోద్యమ నాయకుడు పాతూరి నాగభూషణం జయంతిని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు, వయోజన విద్యా వ్యాప్తికి కృషి చేసిన త్యాగధనుడు స్వాతంత్ర్య సమరయోధుడు నాగభూషణమని కొనియాడారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. వక్తృత్వంలో నాగశ్రీవల్లి, ప్రేమ్‌కుమార్, అభిషయ్ వ్యాసరచన పోటీల్లో కిరణ్‌కుమార్, తబిత, మదన్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగాస్త్ర, ఉపాధ్యాయులు పాల్గొని నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ప్రజలు పరిశుభ్రతను పాటించాలి


పెదపాడు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అమృతం


భీమడోలు: పూళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


దెందులూరు: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పలుచోట్ల ఫ్రైడే–డ్రైడే నిర్వహణ

పెదపాడు: ప్రజలు పరిశుభ్రత పాటించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు పీజే అమృతం తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని అంబికానగర్ 6వ రోడ్‌లోప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమృతం మాట్లాడుతూ పరిశుభ్రంగా ఉంటే కలిగే లాభాలను, అపరిశుభ్రంగా ఉండే కలిగే నష్టాలను వివరించారు. వర్షాకాలంలో నీరు ఎక్కడపడితే అక్కడ నిలువ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది, వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. మురికి కాలువల్లో ఎబెట్ ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టరు సత్యనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, సూపర్‌వైజర్ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పూళ్ల పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం పూళ్ల–1, 2 సబ్ సెంటర్ల ఏరియాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పురవీధుల్లో ర్యాలీ, అవగాహన సదస్సులను నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. నీటి నిల్వలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అనురాధ, హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ నందిని, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలవకుండా చూసుకోండి

ఉంగుటూరు: నివాసిత ప్రదేశాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని లేకపోతే దోమలు ఉధృతంగా పెరిగి హానికరంగా మారతాయని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తల్లాపురం గ్రామంలో పర్యటించారు. డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. దోమకాటుకు గురి కాకుండా చూసుకోవాలని దోమతెరలు వాడాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్, ఆరోగ్య సహాయకుడు కాంతారావు, సూపర్‌వైజర్ కృష్ణ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కొవ్వలిలో పోతునూరు పీఎస్సీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. మానవతా దృక్పథంతో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.